క్లుప్తంగా

నేడు ప్రజావాణి

కోడేరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు ప్రజావాణికి విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు గుండాలలో టెంకాయల వేలం

వెల్దండ: మండల పరిధిలోని గుండాలలో శ్రీఅంబరామలింగేశ్వరస్వామి ఉత్సవాల సందర్భంగా టెంకాయల వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈనెల 30న మధ్యాహ్నం 1.30గంటలకు ఆలయ ఆవరణలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈ వేలంలో పాల్గొనేవారు రూ.20వేలు డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు వేలం పాటలో పాల్గొనాలని వారు కోరారు.

ఆర్థికసాయం



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని 18వ వార్డుకు చెందిన రాము అనారోగ్యంతో మృతిచెందాడు. ఆదివారం పలువురు నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అలాగే మాజీ కౌన్సిలర్ మగ్దూల్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాజర్, రవి, మూర్తి, సుభాన్ తదితరులు ఉన్నారు.

బోనాల పండుగకు ఏర్పాట్లు



కొల్లాపూర్: కొల్లాపూర్‌లో పోషమ్మ, ఈదమ్మ దేవతల బోనాల పండుగల ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీ పరిశీలించారు. ఆదివారం సాయంత్రం కోటమైసమ్మకు సంప్రదాయబద్ధంగా రైతుసంఘాల ఆధ్వర్యంలో నైవేద్యాలు సమర్పించారు. సోమవారం పోషమ్మ దేవత, మంగళవారం ఈదమ్మ దేవతలకు తొలి బోనాలు సమర్పించనున్నారు. పోషమ్మ, ఈదమ్మ గుడుల వద్ద భక్తులకు ఏర్పాటుచేసిన వసతీ సౌకర్యాలను చైర్‌పర్సన్ పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని రైతు సంఘాలకు సూచించారు. ఆమె వెంట కౌన్సిలర్ డాక్టర్.రాముడుయాదవ్, నాయకులు చంద్రశేఖరాచారి, వాసు తదితరులున్నారు.

కాగడాల ప్రదర్శన



అచ్చంపేట: పట్టణంలో ఆదివారం రాత్రి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. భారత్ జోడో యాత్ర కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు 3,500కిలోమీటర్లు దిగ్విజయంగా పాదయాత్ర పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని అమరవీరుల స్థూపం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు కాగడాల ప్రదర్శన చేపట్టారు. డీసీసీ అధ్యక్షుడు డాక్టరు చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ ప్రదర్శనలో నర్సయ్యయాదవ్, రామనాథం, కాశ్నయాదవ్, అంతటి మల్లేష్, హరిశ్చంద్ర, కటకం రఘురాం, మల్లిఖార్జున్, రాజ్‌గోపాల్ పాల్గొన్నారు.

పరామర్శ

కోడేరు: మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు వరదమ్మ(105) శనివారం మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కొత్త రాంమోహన్‌రావు, కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ కరీం, చలపతిరావు, కృష్ణ, ఆదిశరత్, మాజీ వార్డు సభ్యులు రాజు, రామకృష్ణ, బాబు ఉన్నారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్ట్



పెద్దకొత్తపల్లి: మండలంలోని మర్రికల్‌కి చెందిన ముగ్గురు నాటుసారా విక్రయిస్తూ పట్టుబడిన వారిని అరెస్ట్ చేసినట్లు కొల్లాపూర్ ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు తెలిపారు. మర్రికల్‌లో అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్న స్థావరాలపై ఆదివారం ఉదయం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడులలో పరమేష్‌గౌడ్, చిన్నయ్యగౌడ్, రాజ, మహేష్, దస్తగిరి, పాల్గొన్నారు.

ఉత్సవాలకు ముస్తాబు

- నేటి నుంచి తిరుమలాపూర్ వెంకన్న బ్రహ్మోత్సవాలు
- 4న కల్యాణోత్సవం



కొలువుదీరిన వెంకటేశ్వరస్వామి శ్రీదేవి, భూదేవి



ముస్తాబైన ఆలయం

పెద్దకొత్తపల్లి: దేవల్‌తిరుమలాపూర్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి శ్రీదేవి, భూదేవి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని దేవాలయ ధర్మకర్త సర్పంచ్ సత్యం తెలిపారు. మండల కేంద్రానికి 3 కి.మీ.ల దూరంలో ఉన్న దేవల్‌తిరుమలాపూర్‌లో 400 ఏళ్ల క్రితం వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా వెలసిన ఆలయంలో భక్తుల పూజలు అందుకుంటున్నారు. కాకతీయుల కాలంలో ఈ దేవాలయాన్ని ప్రతాపరుద్రుడు ఏర్పాటు చేశారని శిలాశాసనాలు చెబుతున్నాయి. ప్రతి ఏడాది వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మాగమాసంలో ప్రారంభమై నెల రోజుల పాటు జాతర కొనసాగుతుంది. ఈ ప్రాంత ప్రజలు తీరితే తిరుపతి తీరకుంటే తిరుమలాపురం అని నమ్మకంతో పూజలు నిర్వహిస్తారు. ఈ బ్రహ్మోత్సవాలలో వనపర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమై ఫ్రిబ్రవరి 7 వరకు కొనసాగుతాయని ఆలయ ధర్మకర్త సత్యం తెలిపారు. బ్రహ్మోత్సవాలు సోమవారం అంకురార్పణ, 31న గజవాహనసేవ, ఫిబ్రవరి 1న శేషవాహన సేవ, ఫిబ్రవరి 2న హనుమంతు వాహనసేవ, 3న గరుడవాహన సేవ, 4న కల్యాణమహోత్సవం, 5వ తేదీన శ్రీవేంకటేశ్వరస్వామి శ్రీదేవి, భూదేవి రథోత్సవం, 6న అశ్వవాహన సేవ, 7న అంచవాహన సేవలు జరుగుతాయని ఆలయ కమిటీవారు తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

నేటి నుంచి పెద్దమ్మతల్లి బ్రహ్మోత్సవాలు



ముస్తాబైన పెద్దమ్మ దేవి ఆలయం

ఉప్పునుంతల: మండలంలోని తిర్మలాపూర్‌లో యాదవుల కులదైవం పెద్దమ్మతల్లి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి వారంరోజుల పాటు నిర్వహించనున్నారు. యాదవులంతా కలిసి భక్తిశ్రద్ధలతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు యాదవ సంఘం నాయకులు తెలిపారు. సోమవారం గణపతిపూజ పుణ్యాహవచనం, పంచగవ్యమేళన, పోక్షణం, పాశనం, అఖండదీప స్థాపనరక్షాబంధనం, యాగశాల ప్రవేశం, మంగళ హారతి, తీర్థప్రసాదవితరణ, సాయంత్రం మృత్స్యగ్రహణం, అంకురారోహణ అగ్ని ప్రతిష్ఠాపన, గణపతి హోమం, విగ్రహాలకు జలాధివాసం, మంగళహారతి తీర్థప్రసాదవితరణ, 31న మంగళవారం గణపతిపూజ, సామూహిత వ్రతాలు, ఫిబ్రవరి 1న యంత్ర ప్రతిష్ఠాపన, విగ్రహ ప్రతిష్ఠాపన, శిఖర ధ్వజ ప్రాణప్రతిష్ఠ, 2న వ్రతాలు, 3న పటం ప్రదర్శన, కోలాట ప్రదర్శన, 4న పెద్దమ్మ పటం వేసికథలు చెప్పడం, 5న సాయంత్రం పెద్దమ్మ తల్లి బోనాలతు,
6న పెద్దమ్మతల్లి కల్యాణ మహోత్సవం, అనంతర బండారు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

అట్టహాసంగా రథోత్సవం



వెల్టూరు బ్రహ్మోత్సవాల్లో ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరులో రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీ అలువేలు మంగ సమేత లక్ష్మీవెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. స్వామి వారికి పూర్ణాభిషేకం, శేషవాహన సేవ, సూర్యవాహన సేవ, అశ్వవాహన సేవలతో పాటు సాయంత్రం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రాత్రి 11 గంటల ప్రాంతంలో స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు.

హాజరైన ప్రముఖులు..

వెంకటేశ్వర స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున గ్రామస్తులు, భక్తులు రథోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. రాత్రి 8గంటలకు కుంకుమార్చన, రాత్రి 9.30 గంటలకు ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఉత్సవాల్లో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. బ్రహ్మోత్సవాల్లో ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, సర్పంచ్ సుగుణమ్మ, ఎంపీటీసీ రంగారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ లింగమయ్యగౌడ్, వైస్ చైర్మన్ దేవేందర్, నాయకులు కట్టా అనంతరెడ్డి, లింగమయ్య, మల్లయ్య, జంగారావు, బ్రహ్మచారీ, బాల్‌రాజు, జంగయ్య. వేణుగోపాల్‌రెడ్డి భక్తులు పాల్గొన్నారు.

ఉచితంగా హోమియోపతి సేవలు



సత్కరిస్తున్న ఆస్పత్రి నిర్వాహకుడు రామకృష్ణ మూర్తి గురూజీ

మన్ననూర్: స్థానికంగా ఏర్పాటు చేసిన ఈకే హోమియోపతి ఆస్పత్రిలో ఉచితంగా నాణ్యమైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు ఆస్పత్రి నిర్వాహక బాధ్యుడు ఎక్కిరాల రామకృష్ణ మూర్తి గురూజీ తెలిపారు. ఆదివారం ఆస్పత్రిని సందర్శించిన ఆయన గ్రామంలోని ప్రముఖులతో సమావేశమై మాట్లాడారు. గత కొంత కాలంగా నెలలో నాల్గో ఆదివారం మాత్రమే ఆస్పత్రి సేవలు అందించేవారమని అన్నారు. ప్రస్తుతం ఆస్పత్రికి రోగుల సంఖ్య అధికం కావడంతో నెలలో నాలుగు ఆదివారాలు కూడా రోగులకు అందుబాటులో ఉంటూ నిపుణులైన వైద్యాధికారులతో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈకే హోమియో ఆస్పత్రి పేరుతో ఆంధ్ర, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా సేవలందిస్తున్నామని ఆయన అన్నారు. అనంతరం వెంకటరమణ, శేఖర్, శ్రీనివాసులు, అనిత, జయమ్మలకు కండువాలతో సత్కరించారు.

కరాటే విద్యార్థులకు బెల్ట్‌ల పంపిణీ



కరాటే విద్యార్థులకు బెల్ట్‌లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

వెల్దండ: మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్ న్యూ మాంక్స్ కుంగ్‌ఫూ కరాటే విద్యార్థులకు ఆదివారం కరాటే బెల్ట్‌లను సర్పంచ్ భూపతిరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు కరాటే అవసరం అన్నారు. కరాటే ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందన్నారు. కరాటేలో ప్రతిభ కనబర్చిన 43మంది విద్యార్థులకు బెల్ట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి, కరాటే మాస్టర్లు కనకం యాదవ్, శ్యామ్, పీఈటీ రవి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేట గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రామగిరిపై వెలసిన సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఫిబ్రవరిలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వానపత్రాలను ఆదివారం ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎంపీ రాములుకు ఆదివారం ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రామస్వామి, సర్పంచ్ రేణుకబాలస్వామితో పాటు పలువురు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు రామస్వామి తెలిపారు.

తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులతో మాటాడుతున్న స్టేట్ కో-ఆర్డినేటర్ కుమారస్వామి

కల్వకుర్తి టౌన్: ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న ఓపెన్ ఇంటర్ తరగతులను విధిగా సద్వినియోగం చేసుకోవాలని ఓపెన్ ఇంటర్ స్టే కో-ఆర్డినేటర్ కుమారస్వామి అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఓపెన్ ఇంటర్ తరగతులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులకు జరుగుతున్న తరగతులను పరిశీలించడంతోపాటు వారితో మాట్లాడి తరగతుల నిర్వహణపై పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనుకోకుండా చదువుని మధ్యలో నిలిపివేసిన వారికి ఓపెన్ తరగతులు ఒక వరంలా ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం కళాశాలలోని స్టడీసెంటర్‌లో పలు రికార్డులను పరిశీలించి, తరగతులను ఎలా నిర్వహిస్తున్నారన్న అంశాలను కల్వకుర్తి స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్ రెడ్డి, స్టడీ సెంటర్ కౌన్సిలర్ వేణుని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఓపెన్ ఇంటర్ కౌన్సిలర్లు సదానందం, బాలరాజు, భాస్కర్, పరుశురాం, సంతోష్, రవిశంకర్, ఓపెన్ ఇంటర్ విద్యార్థులు ఉన్నారు.

కొనసాగుతున్న కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మన్ననూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు అమ్రాబాద్ మండలం మన్ననూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామ పంచాయితీ ఆవరణలో విజయవంతంగా కొనసాగుతోంది. ఇప్పటి వరకు 660 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి భూపాల్ తెలిపారు. వీరిలో 229 మందికి అద్దాలు అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా 62 మందికి ప్రిస్కిప్షన్ అద్దాల కోసం ఆర్డర్ చేశామన్నారు. వటువర్లపల్లి పీహెచ్‌సీ పరిధిలో 914 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 89 మందికి అద్దాలు అందజేసి, 54 మందికి అవసరమైన ప్రిస్కిప్షన్ అద్దాల కోసం ఆర్డర్ చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీరాం, చత్రునాయక్, గ్రామ పంచాయితీ, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొంటున్నారు.

దళితులకే ప్రాధాన్యం ఇవ్వాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు పథకం అమలులో నిరుపేదలైన దళితులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కమిటీ నాయకులు వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక మహేంద్రనాథ్ కాంప్లెక్స్ ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యేల ప్రమేయం లేకుండ దళితబంధుకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎం. శ్రీనివాస్, చంద్రబాబు, కృష్ణ, వెంకటయ్య, కురుమయ్య, నిరంజనమ్మ, మధు పాల్గొన్నారు.

బలాన్‌పల్లిలో సామూహిక వ్రతాలు



సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లిలో సూర్యనారాయణస్వామి 4వ వార్షికోత్సవ సందర్భంగా ఆదివారం సామూహిక వ్రతాలు, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకం, భగవత్‌గీత పారాయణం, సామూహిక వ్రతాలు కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఏటా రథసప్తమి సందర్భంగా వార్షికోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తామని, అందులో భాగంగా రథసప్తమిని పురస్కరించుకొని 4 రోజులపాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ఆయా గ్రామాల నుంచి పాల్గొంటున్న భక్తులకు అన్ని రకాల వసతులను ఏర్పాటు చేస్తామని ఎంపీపీ శ్రీదేవి, సర్పంచ్ అశోక్ తెలిపారు.

దళితులపై దాడి సరికాదు



బాధితుడిని పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాడూరు: మండలంలోని పాపగల్‌లో అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిని అడ్డుకున్న గ్రామానికి చెందిన దళిత రైతు బాలయ్యపై దాడికి పూనుకోవడం సరైన పద్ధతి కాదని కాంగ్రెస్ నాయకుడు బాలగౌడ్, ఐతోల్ లక్ష్మయ్య విమర్శించారు. ఆదివారం గ్రామంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని, తాము వ్యవసాయంపై ఆధారపడి జీవించేవారమంటూ తమ వ్యవసాయ పొలాలను గుంతలమయం చేయడం సరైన పద్ధతి కాదని, యంత్రాలను నిలిపివేయాలంటూ నినాదాలు చేస్తున్న బాలయ్యను యంత్రంతో తగిలించి ప్రమాదానికి గురి చేశారన్నారు. ఈ మేరకు ఇటాచ్చ్ డ్రైవర్‌పై కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. అధికారి పార్టీ అండదండలతోనే అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని, ప్రకృతి సంపదను దోచుకోవాలని చూస్తే సహించేదిలేదని వారు హెచ్చరించారు.

అగ్నిపథ్‌కు ఎంపికపై హర్షం

అమ్రాబాద్: మండలంలోని మాదవానిపల్లికి చెందిన చెవ్వ సంతోష్‌అగ్నిపథ్(భారతార్మి)ఎంపిక కావడం పట్ల వారి కుటుంబ సభ్యులు గ్రామస్తులు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. భారత ఆర్మిలో చేరి దేశానికి తమ సేవలు అందించేందుకు సంతోష్ ఎంపిక కావడం హర్షనీయమని గ్రామస్తులు ప్రశంసించారు.

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి

నాగర్‌కర్నూల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక కార్మిక విధానాలను తిప్పికొట్టాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.సాగర్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో మాట్లాడారు. ఏప్రిల్ 5వ తేదీన కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కేంద్రం అధికారంలోకి వచ్చాక 29 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా విభజించి కార్మిక వర్గాన్ని విచ్ఛిన్నం చేసిందని ఆరోపించారు. లేబర్‌కోడ్‌ల రద్దు, విద్యుత్ సవరణ బిల్లు, ఉపాధిహామీ పథకానికి నిధులు కేటాయింపులు తదితర అంశాలలో కేంద్రం అవలంభిస్తున్న తీరు సక్రమంగా లేదని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్ శ్రీనివాసులు, ప్రజాసంఘాల నాయకులు ఎం.శ్రీనివాసులు, ఆంజనేయులు, పాదిల రామయ్య, ఈశ్వర్, మల్లేష్, అశోక్, దశరథం, మాసన్న పాల్గొన్నారు.

మురుగుకాల్వలోకి కుళాయి నీరు

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని గాంధీనగర్ కాలనీలోని పెద్ద మురుగుకాల్వలోకి కుళాయి నీరు వదిలిపెట్టారు. మిషన్‌భగీరథలో భాగంగా ఇంట్రా కనెక్షన్లు ప్రతి ఇంటికి మున్సిపల్ ద్వారా కుళాయిలను బిగించారు. గాంధీనగర్ ప్రాంతంలోని పలు కుల సంఘాల భవనాల వద్ద కుళాయిలను బిగించారు. బిగించిన కుళాయిలను సంఘాల భవనాలలోకి తీసుకోకుండా అలాగే వదిలిపెట్టారు. అయితే కుళాయిల కోసం తీసిన గుంతలను పూడ్చే సమయంలో వాటికి కనెక్షన్లు తీసుకోకుండా నేరుగా పెద్ద మురుగుకాల్వలోకి వదిలిపెట్టారు. గత రెండు నెలలుగా ఇలాగే కుళాయిలకు నీటిని వదిలినప్పుడు నీరంతా మురుగుకాల్వలోనే పోతుందని అక్కడి స్థానికులు చెబుతున్నారు. రాబోయేది వేసవికాలం కావడంతో నీటివృథాను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అగ్నివీర్‌కు ఇద్దరు యువకుల ఎంపిక

లింగాల: మండల పరిధిలోని సూరాపూర్‌కు చెందిన జల్లెల కార్తీక్‌కుమార్ అగ్నివీర్‌కు ఎంపికయ్యాడు. శనివారం ఆర్మీ ప్రకటించిన ఫలితాల్లో ఎంపికైనట్లు యువకుడు ఆదివారం తెలిపాడు. దేశ రక్షణ కోసం ఆర్మీలో చేరాలనే ఆకాంక్ష నేడు నెరవేరిందని యువకుడు ఆనందం వ్యక్తం చేశారు.

బల్మూర్: మండల కేంద్రానికి గ్రామానికి చెందిన రేకుల ప్రసాద్ అగ్నివీర్‌కు ఎంపికైనట్లు కుటుంబ సభ్యులు ఆదివారం తెలియజేశారు. ప్రసాద్ అగ్నివీర్‌కు ఎంపికై నట్లు శనివారం ఆర్మీ ప్రకటించిన అర్హుల ఎంపిక ఫలితాల్లో ఎన్నిక కావడం జరిగిందన్నారు. కాగా గ్రామానికి చెందిన యువకుడు అగ్నివీర్‌కు ఎంపిక కావడంపై కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మట్టి తరలింపులో ఘర్షణ



గుంతలమయంగా చేసిన వ్యవసాయ భూమి



మట్టి తరలిస్తున్న టిప్పర్‌లను నిలిపిన గ్రామస్తులు

తాడూరు: మండలంలోని పాపగల్‌లో పాలమూరు-రంగారెడ్డి రిజర్వాయర్ పనుల కోసం అక్రమంగా మట్టిని తరలిస్తున్న వీజేఆర్ కంపెనీకి చెందిన వారిని అడ్డుకుంటున్న గ్రామస్తులపై దాడికి దిగడంతో ఆదివారం గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామంలో కొంతమంది అక్రమంగా మట్టి తరలించేవారికి మద్దతుగా ఉండగా మరికొంతమంది మట్టిని అడ్డుకోవడంతో ఇరువర్గాల వారికి ఘర్షణలో తోపులాట జరగడంతో గ్రామానికి చెందిన బాలయ్యకు గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. కాగా గ్రామంలోని 36 సర్వేలో దాదాపు 38 ఎకరాలు పట్టా భూమిని బీజేఆర్ కంపెనీ అప్పట్లో కొనుగోలు చేసింది. కొనుగోలు చేసిన భూమి నుంచి మట్టిని పాలమూరు-రంగారెడ్డి రిజర్వాయర్‌కు తరలించారు. అదేవిధంగా ప్రభుత్వ భూమి సర్వేర్ 87లో దళితులకు దాదాపు 20 ఏళ్ల కింద ప్రభుత్వం ఇచ్చిందన్నారు. వీటిని భూమిలో నుంచి కూడ అక్రమంగా రిజర్వాయర్‌కోసం మట్టిని తరలించారు. ప్రాజెక్ట్ కోసమే అని అప్పట్లో ఎవరు పట్టించుకోలేదని గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం దళితులకిచ్చిన ప్రభుత్వ భూమిలో నుంచి మళ్లీ మట్టిని తీసి సర్వేనవంబర్.36 లో కొన్న భూమిలోకి అక్రమంగా తరలిస్తుండగా రైతులు అడ్డుకున్నారు. దీంతో గందరగోళం నెలకొంది. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో అక్రమంగా మట్టిని తరలిస్తున్న జేసీబీ, టిప్పర్‌లను అడ్డుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి అక్రమంగా మట్టిని తీసి వ్యవసాయ భూమిని గుంతలమయంగా చేయడంతో తాము వ్యవసాయం ఎలా చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ మట్టి తరలింపు ఆపాలని వారు విజ్ఞప్తి చేశారు.

యోగాతో మానసిక ప్రశాంతత



యోగా శిక్షణలో విద్యార్థినులు

కొల్లాపూర్: యోగాతోనే మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని యోగా శిక్షకులు అలువాల అర్జున్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు యోగా శిక్షణ ఇచ్చారు. ఈ మేరకు పలు ఆసనాలను విద్యార్థినులకు చూపించి వాటితో కలిగే ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులకు చదువుపై ఏకాగ్రత పెరిగేందుకు అవసరమైన యోగా ఆసనాలను వేసి చూపించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ద్వారా మానసిక ప్రశాంతతో పాటు శారీరక ఎదుగుదల కూడా చేకూరుతుందన్నారు. చేస్తున్న పనులపై ఏకాగ్రత పెరిగేందుకు యోగా దోహదపడుతుందని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ స్వర్ణలతతో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.